## ఘనంగా అబ్దుల్ కలాం 11వ వర్ధంతి వేడుకలు




**కందుకూరు శిఖర జనసాక్షి:** కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో,మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసకుంటూ,ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. శాస్త్రవేత్తగా అంతరిక్ష రంగంలో వెలకట్టలేని సేవలు అందించారని పలువురు నేతలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్.సలాం, ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్.రఫీ,నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ,నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్.మున్నా పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి తిరునాళ్ల సాంప్రదాయబద్ధంగా నిర్వహనకు అనుమతి ఇవ్వాలి



**కందుకూరు శిఖర జనసాక్షి:** అన్నెబోయినపల్లె శ్రీ గంగమ్మ తల్లి దేవస్థాన కమిటీ సభ్యులు సోమవారం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శతాబ్దాలుగా గ్రామంలో కొనసాగుతున్న గంగమ్మ తల్లి తిరునాళ్ల ఆచారాలు, సాంప్రదాయాలకు ఎలాంటి భంగం కలగకుండా గతంలో మాదిరిగానే తిరు నాళ్లు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గంగమ్మ తల్లి తిరునాళ్లు గ్రామ ప్రజల విశ్వాసాలు, పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయని తెలిపారు. ఈ ఆచారాల్లో మార్పులు చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, గ్రామంలో అనవసర వివాదాలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. తిరునాళ్ల నిర్వహణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ పెద్దలు,ఆచారవంతులు, ఆలయ కమిటీ సభ్యులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. గ్రామ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, చట్టబద్ధంగా,శాంతియుత వాతావరణంలో తిరునాళ్లు నిర్వహించేందుకు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సంప్రదాయాలకు భంగం కలగకుండా, గతంలో జరిగిన విధంగానే గంగమ్మ తల్లి తిరునాళ్లను నిర్వహించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు సబ్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.గ్రామ ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ, శాంతి భద్రతలను కాపాడుతూ సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## ఘనంగా డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు




**సింగరాయకొండ శిఖర జనసాక్షి:** మాజీ మంత్రి, కొండపి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాల మేరకు సింగరాయకొండలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఆపార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.దేశ అభివృద్ధికి,శాస్త్ర సాంకేతిక రంగానికి కలాం అందించిన సేవలను కొనియాడుతూ, యువతకు ఆయన ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రకాశం జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్. సుల్తాన్, సింగరాయకొండ గ్రామ వైసీపీ అధ్యక్షులు షేక్. కరీం, రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ మట్టిపాటిబాషా,దూదేకుల ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్.రజియా హుసేన్, కొండపి నియోజకవర్గ నూర్‌బాషా అధ్యక్షులు మౌలాలి,అజిత్, కొండపి నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షులు, వైసీపీ పబ్లిసిటీ వింగ్ సభ్యులు షేక్. జిలాని, సింగరాయకొండ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్.అల్లా బక్షు, సింగరాయకొండ వైసీపీ అంగన్‌వాడీ అధ్యక్షురాలు భాగ్యమ్మ, నాయకులు అబ్దుల్ ఖాదర్ తదితరులుపాల్గొని డాక్టర్ కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# రెండేళ్ళలో అంచనాలకు మించి అభివృద్ధి

●రాబోయే మూడేళ్లలో సమస్యలన్నీ తీర్చేలా ప్రణాళిక ●సంక్షేమంలోనూ ముందున్నాం ●ఉలవపాడు ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు శిఖర జనసాక్షి:** ఈ రెండేళ్ల కాలంలో అంచనాలకు మంచి అభివృద్ధి చేశామనిఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉలవపాడు పంచాయతీలోని వరిగచేను సంఘం ఎస్టీ కాలనీలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు,కూటమి పార్టీల నేతలతో కలిసి 60 ఇళ్లకు స్వయంగా వెళ్లి,ఈ రెండేళ్లలో అభివృద్ధి సంక్షేమ వివరాలను స్థానికులకు తెలియజేశారు. వివరాలతో కూడిన కరపత్రాలు అందించారు.సుమారు 3 గంటల సేపు కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రతి ఇంటికి ఏయే సంక్షేమ పథకాలు అందుతున్నాయో తెలుసుకున్నారు. పథకాలు అందడం లేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే అందుకు కారణం ఏమిటో అధికారుల ద్వారా తెలుసుకుని,పరిష్కార మార్గాలు సూచించారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు పలువురు వృద్ధులతో ఆప్యాయతతో మాట్లాడి క్షేమ సమాచారాలు తెలుసుకోవడంతో పాటు ఆర్థిక సహాయాలు అందించారు. కాలనీలో రెండు బజార్లలో సీసీ రోడ్లు, ఒక రోడ్డులో డ్రైనేజీ కాలువ నిర్మించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే కొంతమందికి రేషన్ కార్డులు, పింఛన్లు కొత్తగా మంజూరు చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు.ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రెండేళ్లలో ఉలవపాడు పంచాయతీలో 2.58 కోట్లతో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, కల్వర్టుల నిర్మాణం, స్మశానాల అభివృద్ధి, గోకులం షెడ్లు,పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం, పైపు లైన్లు ఏర్పాటు, కుమ్మరిపాలెం నుంచి కొల్లూరుపాడు ఎస్సీ కాలనీల వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.80 లక్షల రూపాయలతో వేణుగోపాల స్వామి ఆలయానికి నూతన రథం చేయిం చామని చెప్పారు.ఇక ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, డ్వాక్రా మహిళలకు రుణాలు,తల్లికి వందనం, దీపం పథకం, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో, ముఖ్యమంత్రి సహాయ నిధి లాంటి సంక్షేమ పథకాలకు 201.36 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు. ఇవన్నీ రెండేళ్లలో సాధించిన ఘనత అని,రాబోయే మూడేళ్లలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు.ఇంటింటి ప్రచార సమయంలో కాలనీవాసులు వ్యక్తిగతంగా, అభివృద్ధి కోసం చెప్పిన సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా నోట్ చేసుకున్నారు. వీలైనంత త్వరలో వీటిని పరిష్కరిస్తామని చెబుతూ... అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బెల్లం కృష్ణమోహన్,కో కన్వీనర్ గంటాకృష్ణ,యూనిట్ ఇన్‌చార్జి చింతల సింగయ్య, మండల ఎస్టీసెల్ అధ్యక్షులు యాటగిరి ప్రసాద్, కాలనీ నాయకులు పసుపులేటి రాము, యాటగిరి రమణయ్య మాలికల మహేష్ శ్రీహరి రాపూరి శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్ అమ్మనబ్రోలు మాధవ, నెల్లూరు పార్లమెంట్ కార్యదర్శులు మద్దసాని మహేంద్ర, దార్ల యలమందమ్మ,పార్టీ నేతలు బొడ్డుప్రసాద్, అమ్మనబ్రోలు రమేష్, అంచుపోగు వాసు, షేక్. కరీం,డాక్టర్ పవన్, ప్రభావతమ్మ, కందగడ్ల బ్రహ్మయ్య, మార్టూరి కోటేశ్వరరావు,అన్ని గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# మొగిలిచర్ల అవధూత శ్రీ దత్తాత్రేయ స్వామితో మా అనుభవాలు



**కందుకూరు శిఖర జనసాక్షి:** నేను కనిగిరిలో తొమ్మిదో తరగతి చదువుతున్న రోజులు.1974వ సంవత్సరం..అవి ఆ సంవత్సరం వినాయక చవితికి మొగిలిచర్లలోని మా యింటికి వచ్చాను. ఆరోజు ఉదయం సంప్రదాయబద్ధంగా గణపతి పూజ చేసుకున్నాము.ఉదయం 10 గంటల వేళ..మా నాన్న ప్రభావతీ..స్వామివారి దాకా వెళ్ళొద్దామా. అని మా అమ్మను అడిగారు..ఆయన ధ్యానంలో వుంటారేమో..పైగా ఈరోజు మనలను రమ్మనమని కూడా చెప్పలేదు..తీరాఅంతదూరం బండికట్టుకు వెళ్ళాక. స్వామివారు బైటకు రాకపోతే..ఉసూరుమంటూ తిరిగి రావాలి..మీ ఇష్టం..మీరే ఆలోచించుకుని చెప్పండి..అన్నది అమ్మ..వెళదాం ప్రభావతీ. ప్రాప్తం ఉంటే కనబడతారు..లేకుంటే లేదు..అన్నారు..అమ్మకూడా ఒప్పుకున్నది..నాన్న బండి సిద్ధం చేయమని పనివాళ్లకు చెప్పారు.. అమ్మా నాన్న నేనూ ముగ్గురమూ బండిలో బైలుదేరాము..మా అమ్మ స్వామి వారి కోసం ఒక స్టీలు డబ్బాలో కొద్దిగా ఆహారం..అదికూడా స్వామివారు తినే పులగం లాంటి అన్నం..పెట్టుకొని బండి ఎక్కింది. ఒక గంట లోపల మేము ముగ్గురమూ స్వామివారి ఆశ్రమం వద్ద ఉన్నాం..స్వామివారి ప్రహరీ తలుపు తీసి ఉన్నది..మేము లోపలికి అడుగు పెట్టేసరికి. స్వామి వారు బావి వద్ద తూర్పు ముఖంగా నిలబడి వున్నారు..మమల్ని చూసి.. శ్రీధరరావు పండుగపూట ఈ సన్యాసిని చూద్దామని వచ్చారా. అమ్మా.. మీరొస్తారని అంతర్వాణి చెప్పింది..అందుకే ధ్యానం కూడా కుదరలేదు. .సరే..రండి..అంటూ ఆశ్రమం గది వద్దకు వెళ్లారు..స్వామివారి వెనుకే మేమూ వెళ్ళాము..ముందు వరండాలో స్వామివారు ఒక ప్రక్కగా..వారికెదురుగ్గా అమ్మా నాన్న కూర్చున్నారు.వరండా మెట్ల మీద నేను కూర్చున్నాను..స్వామివారు మంచి ఉత్సాహంతో ఉన్నారు..ఆరోజు వినాయకుడి ఆవిర్భావం మొదలుకొని...ఆ అవతార ప్రాశస్త్యం వరకూ చాలా విపులంగా చక్కటి ప్రవచనం లాగా చెప్పారు.అమ్మా నాన్న గార్లు చాలా సంతోషపడ్డారు..ఈ పండుగ రోజు గురువారం నాడు గురు ముఖతాః చాలా చక్కటి విషయాలు తెలుసుకున్నాము స్వామీ. అన్నారు నాన్నగారు..అవును నాయనా..మీ వల్ల మాజన్మ కూడా తరించింది. అన్నది అమ్మ..మళ్లీ ఏదో గుర్తుకొచ్చినట్లుగా నాయనా. మీరు చెపుతున్న విషయాలు వింటూ..మీకోసం తెచ్చిన ఆహారం ఇవ్వటం మర్చి పోయాను..ఇదిగో తీసుకోండి.. అంటూ అమ్మ సంచీలోంచి స్టీలు డబ్బా తీసి ఇచ్చింది.స్వామివారు దాన్ని అందుకోకుండా..నా వైపు తిరిగి.. అక్కడ వంటింట్లో పెట్టు..అన్నారు..అమ్మ చేతులోంచి నేను ఆ డబ్బాను అందుకొని..వంట గదిలో పెట్టి వచ్చాను..స్వామివారు నవ్వుతూ.. అమ్మా.. ఇప్పుడు లెక్క సరిపోయింది"..అని నా వైపు తిరిగి. నువ్వు సెలవు రోజుల్లో మొగిలిచెర్ల వచ్చినప్పుడు..నువ్వే ఆ డబ్బాను నా కోసం తీసుకొచ్చి ఇచ్చేవాడివి కదా..ఇప్పుడు కూడా నీచేత్తోనే లోపల పెట్టావు..'అన్నారు మళ్లీ నవ్వుతూ నేనూ నవ్వాను..మరో పదినిమిషాల తరువాత.. స్వామివారి వద్ద సెలవు తీసుకొని..మేము తిరిగి మాయింటికి బైలుదేరాము. ఆరోజు స్వామి వారు నన్నే ఆహారపు డబ్బాను గదిలో పెట్టమని చెప్ప డంపెద్ద విషయంగా తోచలేదు..ఇప్పుడు ఆలో చించుకుంటే..అది కూడా ఒక భాగ్యంగా అనిపి స్తోంది..ప్రతి వినాయక చవితి నాడు నాకు తప్పక గుర్తు వచ్చే సంఘటన ఇది.. **సర్వమూ.. ఆ దత్తుడి కృప!!....** శ్రీ దత్తాత్రేయ స్వామివారి మందిరం వద్ద ఏర్పాట్లు కోసం సంప్రదించవలసిన మొబైల్ నెంబర్:పవని కృష్ణ కిరీటి: ౬72078 75712(పవని నాగేంద్ర ప్రసాద్..శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరం మొగిలిచెర్ల గ్రామం..వయా కందుకూరు.లింగసముద్రం మండలం.ప్రకాశం జిల్లా సెల్..94402 66380-99089 73699).

## దువ్వలి గ్రామంలోని ఇంటింటికి తెలుగుదేశం ప్రచారం కార్యక్రమం

**మార్కాపురం శిఖర జనసాక్షి:** యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు త్రిపురాంతకం మండలం దువ్వలి గ్రామంలో సోమవారం 163వ బూత్ నంబర్‌లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రెండేళ్ల తెలుగుదేశం ప్రభుత్వ పరిపాలనలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం మండల టీడీపీ అధ్యక్షులు మేకల వలరాజు యాదవ్,క్లస్టర్ మల్లెల అల్లూరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండ్రెడ్డి శివారెడ్డి,బూత్ ఇన్‌చార్జి పేరబోయిన వెంకటేశ్వర్లు, జిల్లెల కృష్ణారెడ్డి,



దాదేనబోయిన అంకలయ్య, కురిచేటి గురవయ్య, పిట్టల శ్రీను, వేల్పుల అంకయ్య, అలాగే దువ్వలి గ్రామ టీడీపీ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Printed by HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225.
Published by YARAMALA NAGABHUSHANAM, Dr.No.1-9-1,BADEVARIPALEM, VALETIVARI PALEM MANDAL, PRAKASAM, ANDHRAPRADESH - PIN. 523113. RNI : APTEL/26/A1736, E-mail :yaramala786@gmail.com.